క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణ శివారులో ఉన్న అర్ధనారీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉత్తరాది కుమార్ ఆధ్వ ర్యంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు సేవ చేయడం సంతోషకరమన్నారు. మాజీ పాలకమండలి సభ్యులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



పూజలు చేస్తున్న ఆలయాధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యాదినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.నరసింహవర్మ మాట్లాడుతూ దేశంలో మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. (ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి సుధీర్, అధ్యాపకులు బాపనయ్య, రాజేంద్రుడు, సునీత, సతీష్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రమేష్‌బాబు, చంద్రమౌళి, పరంధామయ్య, సురేష్, తులసి, రుద్రమదేవి పాల్గొన్నారు.

భూమి పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 249-2 లో 2 ఎకరాల 30 భూమి కోర్టు తగదాలో ఉండడంతో సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యం, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు మండల సర్వేయర్ రాజ్‌కుమార్‌తో కలసి పరిశీలించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ గత పదేళ్లుగా కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 249-2 లో 2 ఎకరాల 30 భూమి కోర్టు తగదాలో ఉందని తెలిపారు. ఈ భూమిలో జెడ్పీ ఉన్నత పాఠశాల, తెలుగుగంగ డీఈ కార్యాలయం, క్వార్టర్స్, గ్రంథాలయం, బీసీ హాస్టల్ భవనాలతోపాటు, అంబేడ్కర్ భవన్‌కు కేటాయించిన స్థలంతోపాటు, ఖాళీ స్థలం ఉన్నా రు. ఈ భూమి తమదని బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన గల్లారత్నమ్మ కోర్టులో కేసు వేసి ఉందని, ఈ భూమికి సంబంధించిన రికార్డుల ను పరిశీలించి కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు.

కంచరపాళెంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారం



ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

వరదయ్యపాళెం: మండలంలోని కంచరపాళెంలో లోఓల్టేజి సమస్య పరిష్కారానికి విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు సోమ వారం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రత్యేకంగా అమర్చి లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం చూపినట్లు ఏఈ విజయ్ వెంకటేష్ తెలిపారు. అక్కడ అవసరాన్ని బట్టి మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

తుపాకీ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

నారాయణవనం: అక్రమంగా నాటు తుపాకీ కలిగిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం సాయంత్రం నిందితులను మీడియా ముందు హాజరు పరిచారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం మండలంలోని చిత్తూరు కండ్రిగ సమీపంలోని అటవీప్రాంతంలో నాటు తుపాకీతో ఇద్దరు వ్యక్తులు సంచస్తున్నారన్న సమాచారం అందిందన్నారు. దీంతో తాను సిబ్బందితో కలసి ఎర్రమిట్ట ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన తుంబూరు ఎస్టీ కాలనీకి వాసి ఎల్లయ్య, వెలుతూరుకండ్రిగ ఎస్టీ కాలనీ వాసి లక్ష్మయ్యను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నామన్నారు. తుపాకీతో కుందేళ్లు, అడవి పిల్లులను వేటాడి, మాంసాన్ని పరిసర గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు.

పేరుకే మేజర్ పంచాయతీ.. పల్లె నుంచి పట్టణస్థాయికి పెరిగినా పారిశుద్ధ్య పరంగా పురోగతి లేదు. గ్రామంలోని పలు వీధుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు.. ఇళ్ల మధ్యలో మురుగు గుంటలు దర్శనమిస్తున్నాయి. వెరసి.. రేణిగుంట కాదు.. చెత్తగుంటగా మారింది. ఇందుకు అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల ఉదాసీనతే కారణమైంది. ఫలితంగా అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెందాయి. అంటువ్యాధులు.. జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇదీ రేణిగుంట దుస్థితి.



రేణిగుంటలోని ఓ వీధిలో తొలగించని చెత్త

చెత్తగుంట...!
- రేణిగుంటలో లోపించిన పారిశుద్ధ్యం
- ఎక్కడిచెత్త అక్కడే
- డెంగీ కేసు నమోదు

కానరాని చెత్తశుద్ధి

రేణిగుంట: తిరుమల ముఖద్వారంగా పిలిచే రేణిగుంటలో పారిశుద్ధ్యం పడకేసింది. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెంది, ప్రాణాంతక డెంగీ వంటి సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. రేణిగుంట భజనగుడి వీధిలో పియూష్(17)కు డెంగీ నిర్ధారణ కావడంతో నాలుగు రోజులుగా కరకంబాడి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఆ ప్రాంతంలో మురుగునీరు నిల్వ లేకుండా డ్రైనేజీ కాల్వలను సోమవారం శుభ్రం చేశారు. దోమల నివారణకు మందును పిచికారీ చేశారు. ఈ విషయమై మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డిని వివరణకోరగా డెంగీ కేసు నమోదైనట్లు తమకు సమాచారం అందిందని, అయితే వారు ఎలాంటి రిపోర్టులు చూపలేదన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

పేరుకుపోయిన చెత్త కుప్పలు

రేణిగుంటలో ఎక్కడ పడితే అక్కడ చెత్త నిల్వలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. దీనికితోడు మురుగునీటి కాల్వలు కూడా దుర్గంధభరితంగా మారి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. పట్టణంలో ప్రధానంగా ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లోని మురుగునీటి నిల్వలు పందుల స్థావరాలుగా మారి, వ్యాధులు విజృంభించేందుకు కారణమవుతున్నాయి. రోజూ చెత్త ఎత్తించాల్సిన పంచాయతీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తుండడంతో చెత్తనిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల కారణంగా ప్రాణాంతక వ్యాధులు మరిన్ని నమోదు కాకముందే అధికార యంత్రాంగం అప్రమత్తమై పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.



పాంచాలినగర్‌లో ఇళ్ల మధ్య పందుల విహారం

పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలి



రేణిగుంట పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగునీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మురుగునీరు ఇళ్ల మధ్య నిలిచిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. పందులు కూడా ఇళ్ల మధ్యనే తిరుగుతూ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో జ్వరాలు, తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపి, చెత్త నిల్వలు, మురుగునీటి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంతోపాటు సాయంత్రం వేళలో దోమల నివారణకు ప్రతిరోజూ ఫాగింగ్ చేయించాలి. - కె.ఈశ్వరమ్మ, రేణిగుంట

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. నీళ్లను కాచి తాగాలి. దోమతెరలను వాడాలి. చిన్నపాటి జ్వరం లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వచ్చి అన్ని పరీక్షలు చేయించుకుని, తగిన వైద్యసేవలు పొందాలి. - డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, రేణిగుంట

పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

రేణిగుంటలో ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్మికులు చెత్తను, మురుగునీటి కాల్వలను శుభ్రం చేస్తున్నారు. ఎక్కడైనా అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయకూడదు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. - విష్ణుచిరంజీవి, ఎంపీడీఓ, రేణిగుంట

దళితుల భూములకు పట్టాలు ఇవ్వండి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాటూరు రెవెన్యూ గ్రామంలోని వేదాల శ్రీనివాసపురం దళితులు సాగు చేసుకుంటున్న భూములను వారికే అప్పజెప్పాలని సీపీఐ అధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి చిన్నిరాజ్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 340లో 39 ఎకరాల్లో చెట్టు, పుట్ట కొట్టి తీర్చుకుని సాగు చేసుకుంటుంటే బీఎన్ కండ్రిగ రెవెన్యూ అధికారులు సుమారు పది ఎకరాలకు అక్రమంగా పట్టాలు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గడిచిన 30 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్న వారిని వదిలేసి వేరొకరి పేరు మీద పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆర్డీఓ క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి, దళితులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు, సీపీఐ కార్యదర్శి సీహెచ్ సుధాకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు ఎం.పార్థసారథి, ఎం.రమణయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా హరినాథ్



సమావేశమైన సీపీఎం నాయకులు

రేణిగుంట: సీపీఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా రేణిగుంట మండల కార్యదర్శి హరినాథ్ ఎన్నికయ్యారు. రేణిగుంట సీపీఎం కార్యాలయంలో సోమవారం రేణిగుంట, ఏర్పేడు మండలాల పార్టీ సభ్యులతో ప్రాంతీయ మొదటి మహాసభ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య చేతుల మీదుగా ఎర్ర జెండా ఎగరవేసి, అఖిలభారత జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం రేణిగుంట- ఏర్పేడు మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా కొండ్రెడ్డి హరినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఈశ్వరమ్మ, సత్య శ్రీ, సెల్వరాజు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, రంగయ్య, కరీముల్లా, బాలకృష్ణ, రాజేంద్ర, ఆహ్వానితులుగా సీనియర్ నాయకుడు వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తెప్పపై రామచంద్రమూర్తి విహారం



తెప్పోత్సవంలో శ్రీరామచంద్రమూర్తి

నారాయణవనం: టీటీడీ అనుబంధ స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం సాయంత్రం తెప్పపై సీతా, లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అయిదు రోజుల పాటు నిర్వహించనున్న తెప్పోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సుప్రభాతసేవతో నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అర్చకులు తిరుచ్చిపై సీతా, లక్ష్మణ సమేత రామచంద్రమూర్తిని పల్లకి అధిష్ఠింపచేసి, సుగంధ పరిమళ పుష్ప మాలికలు, పట్టు పీతాంబరాలను అలంకరించారు. ఊరేగింపుగా పద్మసరస్సుకు చేరుకున్న ఉత్సవమూర్తులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై అధిష్ఠించారు. వేద, గాత్ర, నాదకచ్చేరీల మధ్య స్వామివారి తెప్ప సరస్సులో మూడు ప్రదక్షిణలు చేసింది. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం, అనంతరం ఏకాంత సేవను నిర్వహించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈఓ పార్థసారథి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ భరత్, భద్రతా జమేదార్ మల్లికార్జున పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెండో రోజు మంగళవారం ఆండాళ్ అమ్మవారికి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ/శ్రీకాళహస్తి/రేణిగుంట/నాగలాపురం: మండలాల్లో విద్యార్థులకు సోమవారం డీజీపీ జూమ్ మీటింగ్ పెట్టి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బుచ్చినాయుడు కండ్రిగలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, చైతన్యం తీసుకొచ్చేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

వరదయ్యపాళెంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



దారికి అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగిస్తున్న ఎస్‌ఐ

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు మండల ఎస్‌ఐ మల్లికార్జున్ నేతృత్వంలో చర్యలు చేపట్టారు. 'పద్మవ్యూహంలో వరదయ్యపాళెం ట్రాఫిక్' అన్న శీర్షికన సాక్షిలో ఈ నెల 4న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్‌ఐ సోమవారం పోలీస్ కూడలిలోని ప్రధాన మార్గంలో రోడ్డుకిరువైపులా ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమైన దుకాణాలను తొలగించారు. రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులకు క్రీడాలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో సోమవారం సత్యవేడు నియోజకవర్గస్థాయి వాలీబాల్, కబడ్డీ అండర్ 14, 17 పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల వలన విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. నిర్వాహకుడు జనార్ధన్, పీడీలు, పీఈటీలు, గ్రామస్తులు సుధాకర్‌నాయుడు, శేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సులోచన తెలిపారు. గత వారం బంగారుపాళెంలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి బాల, బాలికల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీలలో 10వ తరగతి విద్యార్థులు మాఘలక్ష్మి, చారు, 9వ తరగతి విద్యా ర్థులు మునిజీవన్, నవీన్ కుమార్, కృష్ణకిషోర్, గోపిక ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. తిరుపతి మంగళంలో ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు బాలాజీ, రిషి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వెల్లడించారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో ఈనెల 23 నుంచి అనంతరపురంలో జరిగే పోటీలలో బాలురు, 28 నుంచి కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో బాలికలు పాల్గొంటారని తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్-14 విభాగంలో ఈనెల 16 నుంచి చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో, నెల 24 నుంచి తిరుపతిలో జరిగే బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్ తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, పీడీలు సదాశివం, ఉపాధ్యాయులు వర్మ, మునివేలు, లక్ష్మీపసాద్, ధనలక్ష్మి అభినందించారు.

పాడి పరిశ్రమపై మహిళలకు శిక్షణ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అక్కుర్తి గ్రామంలో నా బోర్డు వారి ఆర్థిక సహాయంతో పాడి పరిశ్రమ-గ్రామీణ వ్యవస్థపకత అనే అంశంపై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ శోభారాణి, విస్తరణ సంచారకులు డాక్టర్ కే.నాగేశ్వరరావు, సర్పంచ్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో పశువులను పెంచడం వల్ల అధిక పాలను ఉత్పత్తి చేయొచ్చన్నారు. పాలను అమ్మే కంటే పాల పదార్థాలుగా తయారు చేసి విక్రయించడం వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. 15 రోజులు పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. సీసీవీఈసీ కోఆర్డినేటర్, శిక్షణ డైరెక్టర్ కే.సుజాత, శిక్షణ కో-ఆర్డినేటర్స్ డాక్టర్ గంగరాజు, డాక్టర్ విజయగీత, డాక్టర్ మంజరి, పంచాయతీ సెక్రటరీ లీలావతి పాల్గొన్నారు.


నైవేద్య పాత్రల వితరణ



నైవేద్య పాత్రలను అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమారం చెన్నైకు చెందిన దాత శ్రీనివాస్ చౌదరి రూ.92,332 విలువ చేసే ఏడు పెద్ద నైవేద్యపాత్రలు, ఆరు చిన్న నైవేద్య పాత్రలను వితరణ చేశారు. వీటిని ఆలయాధికారులు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్త జనం



దీపాల కాంతుల్లో వైష్ణవపుష్కరిణి



శివలింగాకృతిలో ఏర్పాటు చేసిన కార్తీక దీపాలు



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రాహుకేతు పూజలు కూడా పెద్ద సంఖ్యలో జరిగాయి. క్యూలలో భక్తుల రద్దీని ఈఓ బాపిరెడ్డి, అధికారులు పర్యవేక్షించారు. పట్టణంలోని వైష్ణవపుష్కరిణిలో రాత్రి లక్ష దీపారాధన చేశారు. దీంతో వైష్ణవపుష్కరణి దీపాల వెలుగులో దేదీప్యమానంగా వెలుగొందింది. మూడో వారం భరద్వాజతీర్థంలో దీపాలు వెలిగిచేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా అత్యధికమంది భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

ఎరువూ కరువేనా బాబూ..!

- ఆధార్ కార్డుకు 5 బస్తాలే
- ఆంక్షలతో ఆర్బీకేల్లో యూరియా పంపిణీ
- బస్తాపై రూ.30 అదనంగా ప్రైవేటు డీలర్ల అమ్మకం
- ఇది కూడా గుళికలు కొంటేనే యూరియా పంపిణీ




వరదయ్యపాళెం వ్యవసాయశాఖ కార్యాలయంలో యూరియా టోకన్ల కోసం గుమికూడిన రైతులు

వరదయ్యపాళెం: మండలంలో యూరియా కోసం రైతుల పాట్లు అన్నీ ఇన్నీకావు. ఆర్బీకేల్లో యూరియా పంపిణీకి కూటమి ప్రభుత్వం ఏమాత్రం చర్యలు చేపట్టలేదు. దీంతో పలు ఆంక్షలతో అరకొర పంపిణీకి వ్యవసాయశాఖ సిద్ధమైంది. ఆర్బీకేల్లో రూ.267కే దొరికే యూరియా బస్తా డీలర్ల వద్ద బస్తాను రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. అది కూడా ఐదు కిలోల గుళికలు కొన్నవారికే యూరియా పంపిణీ చే స్తామని ప్రైవేటు డీలర్లు ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో రైతులు ఆర్బీకేలలో పంపిణీ చేసే యూరియా కో సం ఎదురు చూస్తున్నప్పటికీ అక్కడ అవసరమైన స్టా కు లేకపోవడంతో వచ్చిన అరకొర బస్తాలకు రైతులు పోటీ పడుతున్నారు. దీంతో వ్యవసాయ సిబ్బంది రై తులకు సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఆధార్ కార్డుకు ఐదు బస్తాలే

మండలంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా లేకపోవడంతో వ్యవసాయశాఖ ఆంక్షలు విధిస్తోంది. ఆ మేరకు భూములున్న రైతులకు సంబంధించి ఆధార్ కార్డుకు ఐదు బస్తాలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. దీంతో మండల వ్యవసాయ కార్యాలయానికి సమీపంలోని ఇందిరానగర్ రైతు భరోసా కేంద్రం వద్ద యూరియా నిల్వ ఉంచడంతో అక్కడికి పెద్ద ఎత్తున రైతులు చేరుకుంటూ యూరియా కోసం పోటీపడి మరీ టోకెన్లు తీసుకునే పరిస్థితి నెలకొంది. మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌కు 8వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. వీరికి సుమారు 1200 టన్నుల యూరియా అవసరముంది. అయితే ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి 150 టన్నుల మేరకు 13 లారీలు మాత్రమే గోడౌన్ నుంచి సరఫరా అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మరో 150 టన్నులు ప్రైవేటు డీలర్ల వద్ద స్టాకు ఉన్నట్లు సమాచారం. అయితే ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న యూరియా గోళీలు లావుగా ఉండడంతో అది సరిగా పనిచేయవని రైతులు తిరస్కరిస్తున్నారు. ఆ దశగా ప్రస్తుత పంట సాగు దృష్ట్యా 700 టన్నుల అవసరముంది. దీనిపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి విరివిగా యూరియాను రైతులకు అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు. ఆధార్ కార్డుకు ఐదు బస్తాలు ఇస్తే 5 ఎకరాలున్న రైతు ఏమి చేయాలని ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో ఏ సీజన్‌లో కూడా ఎరువుల కొరత ఏర్పడిన పరిస్థితి లేదని రైతులు చర్చించుకుంటున్నారు. అంతేకాక ఎక్కడికక్కడ ఆర్బీకేలలో ఎరువులు సరఫరా చేయడంతో రవాణా ఖర్చులు కూడా రైతుకు మిగిలేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రవాణాకు రెండింతలు ఖర్చవుతున్నట్లు వాపోతున్నారు. అది కూడా స్టాకు ఉన్నప్పుడే యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, దీనివల్ల పంట అదును దాటిపోతుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాన్ని దండగలా మార్చే దశగా కూటమి ప్రభుత్వం పావులు కదుపుతుందని రైతులు శాపనార్థాలు పెడుతున్నారు.


గుళికలు కొంటేనే యూరియా



వరదయ్యపాళెంలోని ప్రైవేటు దుకాణాల్లో ఐదు కేజీల గుళికలు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామంటున్నారు. అవసరం లేని గుళికలు కొనుగోలు చేసి ఏం చేయాలి. ఇలాంటి ఆంక్షలు గతంలో ఎప్పుడూ చూడలేదు. అంతేకాక పంట ఎదుగుదలకు అవసరమైన పొటాష్ అటు ప్రైవేటు దుకాణాల్లో గానీ ఇటు ప్రభుత్వ ఆర్బీకేల్లో గానీ అందుబాటులో లేవు. అదునుకి ఎరువులు అందుబాటులో లేకపోవడం కూటమి ప్రభుత్వం చేతగానితనం. రైతులను ఇబ్బందిపెట్టే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే.

-గంగయ్య, రైతు, వరదయ్యపాళెం మండలం

గత ప్రభుత్వంలో కొరతే లేదు



గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఎరువుల కొరత అనే పదం రైతు చెవిన పడలేదు. గ్రామస్థాయిలోనే ఎరువులు సరఫరా అయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించి యూరియా కోసం టోకన్లు అందుకోవల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులే కొనసాగితే వ్యవసాయం కష్టతరమవుతుంది. ఈ ఏడాది రైతు భరోసా కూడా ఇవ్వకపోవడంతో పెట్టుబడికి సైతం రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పలేదు.

-గురుస్వామి, రైతు, వరదయ్యపాళెం మండలం